క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న చేయూత సభ్యులు

డిండి : మండల కేంద్రానికి చెందిన నూకం చినసాయిలు అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. డిండి యువత చేయూత ఆధ్వర్యంలో ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయంగా రూ.10 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో శైలేష్, ఏటి.కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, దినేష్, వెంకటేష్, ఖయ్యూం, గోవర్దన్, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



కల్యాణంలో పాల్గొన్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ శోభారాణిఏవీరెడ్డి దంపతులు

పెద్దఅడిశర్లపల్లి : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచమ బొడ్రాయి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కల్యాణాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. జెడ్పీ ఫ్లోర్ లీడర్ అలుగుబెల్లి శోభారాణిఏవిరెడ్డి దంపతులు ఈ కల్యాణోత్సవంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కల్యాణోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్ భవన్ ముట్టడిని విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : నీట్ పేపర్ లీకేజి నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తూ జూలై 1న జరిగే రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు ఇందూరు సాగర్, డివిజన్ పీడీఎస్‌యూ కార్యదర్శి మధు, ఆర్. దీపక్, రాజు, కుమారస్వామి, లింగరాజులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. నీట్ విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు విద్యార్థి, యువజన సంఘాలు అండగా ఉంటాయని, జాతీయ స్థాయిలో పరీక్షా విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర స్థాయిల్లోనే పరీక్షలను నిర్వహించాలని కోరారు. ఈ రాజ్‌భవన్ ముట్టడిని విజయవంతం చేసేందుకు విద్యార్థి, యువజన సంఘాలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ వార్షికోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారం గ్రామంలో గల శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, పుణ్యాహవచనం, పంచామృతాలతో అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు ప్రజావాణి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నోముల శ్యామ్ సేవలు గొప్పవి

నల్లగొండ టౌన్ : ఉద్యోగ నిర్వహణలో, అయ్యప్ప మాలధారణ సమయంలో గురుస్వామిగా నోముల శ్యామ్ చేసిన సేవలు గొప్పవని హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కొలనుపాక రవికుమార్ కొనియాడారు. రామగిరిలోని అయ్యప్ప స్వామి దేవాలయ గురుస్వామిగా, కలెక్టరేట్‌లో ఆఫీస్ సబార్డినేట్‌గా 34 సంవత్సరాలు పని చేసిన శ్యామ్‌ను ఆదివారం ఆలయంలో ఆయన సన్మానించారు. శ్యామ్ 11 సార్లు ఉత్తమ సర్వీస్ అవార్డు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలిశాల అశోక్ గురుస్వామి, సాంబయ్య, మేడం విశ్వప్రసాద్, ఉప్పల కమలాకర్, కరుణాకర్ శ్యామ్, తుపాకి బిక్షం, రేపాల భద్రాద్రి, రాములు, బంగారు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

చెత్త రహిత పట్టణమే లక్ష్యంగా..

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- ఇద్దరు పర్యవేక్షణ అధికారుల నియామకం
- బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీల ఏర్పాటు
- నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానే



మిర్యాలగూడ పట్టణంలో రోడ్లపై చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మిర్యాలగూడ టౌన్ : పారిశ్రామికంగా రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ పట్టణంలో మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిని సారించారు. అయితే పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు నూతన విధానానికి శ్రీకారం చుట్టారు. నిర్దేశిత ప్రాంతాల్లో కాకుండా ఇష్టానుసారంగా చెత్త పడేసేవారికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు జరిమానాను విధించాలని నిర్ణయించారు. ఇందుకు గాను ఖాళీ ప్రదేశాల్లో 'ఇచ్చట చెత్త వేయరాదు' చెత్త వేసినచో రూ.వెయ్యి జరిమానా విధించనున్నట్లు అని రాయించి ఫ్లెక్సీలను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నారు.

చెత్త సేకరణ బుట్టల జాడేదీ?

తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి సేకరించేందుకు గతంలో మున్సిపల్ శాఖ స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ బుట్టలను పంపిణీ చేశారు. అయినా వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోకుండా ఓపెన్ ప్లాట్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేస్తున్నారు. దీంతో పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుంది. పందులు స్వైరవిహారం చేయడంతో పాటు దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానను విధించేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధం అవుతున్నారు.

మున్సిపాలిటీలో వార్డులు	48
ప్రస్తుత జనాభా	1.33 లక్షలు
పారిశుద్ధ్య సిబ్బంది	278
పారిశుద్ధ్యసిబ్బంది రెగ్యులర్	44
గృహాలు సుమారు	26.506 వేలు
నిత్యం వెలువడుతున్న చెత్త మొత్తం	70 మెట్రిక్ టన్నులు
ప్రస్తుతం నడుస్తున్నవి	36 ఆటోలు, ట్రాక్టర్లు

70 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి

మున్సిపాలిటీలోని 48 వార్డులుండగా ఆయా వార్డుల నుంచి కమర్షియల్ ప్రాంతాలు, ఓపెన్ ప్రాంతాలు, నివాస గృహాల నుంచి వెలువడుతున్న చెత్త వెలువడుతుంది. దీంతో మున్సిపాలిటీలో ప్రతి రోజు 70 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. పారిశుద్ధ్య సిబ్బంది ఈ చెత్తను సేకరించి పట్టణ శివారులో గల రాంనగర్ బంధం వద్ద గల డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు.

వార్డుల వారీగా బాధ్యతల అప్పగింత

మున్సిపాలిటీ సమర్థవంతంగా పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపరిచేందుకు ఇద్దరికి పారిశుద్ధ్య పర్యవేక్షణ చేసేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్లు ఇరువురికి ఈ బాధ్యతలను మున్సిపల్ కమిషనర్ ఎండి యూసుఫ్ అప్పగించారు. మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణకు 8, 9, 10, 11, 12, 13, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 40, 41, 42, 43, 44, 48 వార్డులు కాగా పర్యావరణ ఇంజనీర్ శ్వేతారెడ్డికి 1, 2, 3, 4, 5, 6, 7, 14, 15, 16, 17, 18, 19, 20, 21, 33, 34, 35, 36, 37, 38, 45, 46, 47వార్డులను కేటాయించడం జరిగిందన్నారు.

చెత్త వేసే వారికి జరిమానా



మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, పర్యావరణ ఇంజనీర్‌లతో నిరంతరం పారిశుద్ధ్యంపై పర్యవేక్షిస్తాం. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నూతన విధానాని శ్రీకారం చుట్టాం. చెత్త వేసే వారికి రూ.వెయ్యి జరిమానా విధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల్లో మార్పు తీసుకవచ్చేందుకు కృషి చేస్తాం.
– మహ్మద్ యూసుఫ్, కమిషనర్, మిర్యాలగూడ

రాష్ట్రస్థాయి పోటీలకు 'సెయింట్ జోసెఫ్' విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులు

నాగార్జునసాగర్ : ఈ నెల 30న నల్లగొండ జిల్లా మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన అండర్ -8,10,12 బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్‌లో స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. 8ఏళ్ల విభాగంలో 50మీటర్ల రన్నింగ్‌లో యోజిత ద్వితీయ స్థానం, 10ఏళ్ల విభాగంలో 100మీటర్లలో గౌతమికి మొదటి స్థానంలో నిలిచింది.12 ఏళ్ల విభాగంలో షర్మిల లాంగ్ జంప్ మొదటి స్థానం, 100మీటర్ల రన్నింగ్‌లోద్వితీయ స్థానంలో నిలిచింది. లాంగ్ జంప్‌లో దీక్షిత ద్వితీయ స్థానంలో నిలువగా అండర్12 విభాగంలో లాంగ్ జంప్‌లో నిఖిలేష్ మొదటి స్థానం,న జీబ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరంతా ఈనెల 7న రంగారెడ్డి జిల్లా పుల్లల గోపీచంద్ బ్యాట్మింటన్ అకాడమీ ప్రధాన స్టేడియం లక్ష నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ కిడ్స్ పోటీలకు హాజరుకానున్నారు. వీరిని ఆ పాఠశాల హెడ్‌మాస్టర్ సిస్టర్ లలిత, సిస్టర్ మతీనాలతో పాటు పీఈటీ కిరణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

మలబార్‌లో నూతన నెక్లెస్ ఆవిష్కరణ



నూవా నెక్లెస్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రితిక

మిర్యాలగూడ : పట్టణంలోని మలబార్ గోల్డెన్ డైమండ్స్ షాపులో శనివారం నూతనంగా మైన్ డైమండ్స్‌లో వినూత్నమైన కొత్త కలెక్షన్ నూవా అనే నెక్లెస్‌ను డాక్టర్ రితిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్టోర్ హెడ్ సమీర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన బంగారు, డైమండ్ ఆభరణాలను అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టోర్ మేనేజర్ తౌఫిక్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

దేవరకొండ : 50 ఏళ్లు నిండిన హమాలీ కార్మికులకు నెలకు పదివేలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో నిర్వహించిన హమాలి కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా వివిధ అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ చట్టాలు రూపొందించాలన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు.ఇళ్ల స్థలాలు లేని వారికి ఇంటి నిర్మాణాలు చేపట్టి రేషన్ కార్డులు జారీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, నేనావత్ ఆర్య, తిరుపతయ్య,దస్రునాయక్,వెంకటి,రాములు, తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవరుచుకోవాలి



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను కలిగి ఉన్నట్లయితే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. ఆదివారం మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి, పర్వతవర్ధిని సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయ సప్తమ వార్షిక కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ఆయన వెంట జిల్లా రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మట్టపల్లి సైదులుయాదవ్, పాదూరి సంజీవరెడ్డి, యాదమ్మ శ్రీనివాస్, లింగయ్య, ఆంజనేయులు, వెంకన్న, నాగేందర్, రవి, వెంకన్న, ఎల్లయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న కార్యదర్శి గిరిజాకుమారి

హుజూర్‌నగర్‌రూరల్ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రత్యేక అధికారి తుమ్మల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బూరుగడ్డలో గ్రామకార్యదర్శి మంత్రిప్రగడ గిరిజాకుమారితో కలిసి పారిశుద్ధ్య నివారణ చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో ఇటీవల 10డెంగీ కేసులను గుర్తించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రయంలో ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్ : వ్యవసాయ కార్మికులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ నూతన ప్రభుత్వం భూమి లేని పేదలకు 12 వేలు, కౌలు రైతులకు 15 వేలు, ఇల్లు లేని వ్యవసాయ పేదలకు ఇంటి స్థలం ఇచ్చి కట్టుకోవడానికి 5 లక్షలు ఇస్తామని హామీలు ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాస జిల్లా అధ్యక్షులు బొజ్జ చిన్న వెంకులు, దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, మన్నె బిక్షం, చింతపల్లి లూర్దు మారయ్య, బొడ్డు బాల సైదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య

రైతుబంధు పథకంపై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

డిండి : రాష్ట్రంలో వ్యవసాయం చేస్తున్న రైతులకు రైతు భరోసా ద్వారా అందించే పెట్టుబడి సాయం విషయంలో ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీఓ(డిస్ట్రిక్ కో ఆపరేటివ్ ఆఫీసర్) కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక ఎకరం నుంచి పది ఎకరాలకు వరకు వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్న వారికే రైతు భరోసా అందించాలని పలువురు రైతులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రైతలు అభిప్రాయ సేకరణ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చెర్మన్ శ్రీనివాసారావు, ఏఓ నాగేశ్వరరావు, సీఈఓ బాల్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



క్రీడాకారులతో సీఐ ఆనంద్ కుమార్

నల్లగొండ టూటౌన్ : క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని ట్రాఫిక్ సీఐ ఆనంద్ కుమార్ అన్నారు. తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్, సన్ లైట్ తైక్వాండో అకాడమీల ఆధ్వర్యంలో నల్లగొండలో యాదాద్రి జిల్లా క్రీడాకారులకు ఆదివారం బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. టెస్టులో అర్హత పొందిన వారికి బెల్టులు అందజేసిన సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు వారికి నచ్చిన క్రీడా పోటీల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.

లక్ష్మణ్‌రావు సేవలు మరువలేనివి



లక్ష్మణ్‌రావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి

పెద్దఅడిశర్లపల్లి : దేవరకొండ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కటికనేని లక్ష్మణ్‌రావు సేవలు మరువలేనివని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలు అన్నారు. ఆదివారం గుడిపల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన లక్ష్మణ్‌రావు విగ్రహాన్ని వారు దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌గానే కాకుండా కృష్ణా జలాల సాధన ఉద్యమంలో ఆయన సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, చందర్‌రావు, ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి, మాధవరావు, అర్వపల్లి నర్సింహా, పరమేష్ తదితరులున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించడంపై హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలో ఉపాధ్యాయులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్‌నాయక్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వేలాది మందికి పదోన్నతులు కల్పించడం హర్షణీయమన్నారు. 2015 నుంచి ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించకపోవడంతో వేలాది మంది పదోన్నతి పొందకుండానే పదవి విరమణ పొందారన్నారు. ఉపాధ్యాయులకు రావాల్సిన 5డీఏలను మంజూరు చేయాలని, పీఆర్‌సీ అమలు పరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుగులోతు గోపీనాయక్, మక్లనాయక్, వెంకన్ననాయక్, రవీందర్‌నాయక్, శ్రీనునాయక్, సక్రునాయక్, తులసీరామ్, మోతిలాల్, అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలి



మాట్లాడుతున్న వనపర్తి డిప్యూటీ కలెక్టర్ చొల్లేటి వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ టౌన్ : విశ్వబ్రాహ్మణులు జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని వనపర్తి డిప్యూటీ కలెక్టర్ చొల్లేటి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం జెఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ–నల్లగొండ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విశ్వ బ్రాహ్మణులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ పేదరికంలో మగ్గుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు కొండోజు కృష్ణమాచారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసోజు శ్రీనివాస్, పెదోంట సోము, ప్రచార కార్యదర్శి బొడ్డుపల్లి రామకృష్ణ, కృష్ణామాచారి, బ్రహ్మాచారి, బిష్మాచారి, రాఘవాచారి, విశ్వబ్రహ్మణ సంఘం రాష్ట్ర నేత అన్నభిమోజు నాగార్జునచారి, ఈశ్వరాచారి, కన్వీనర్ శ్రీనివాసాచారి, గోవర్ధనాచారి, సైదాచారి, వెంకటాచారి, వెంకటాచారి, నారబత్తుల శ్రీని వాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ' పేరుతో ప్రతి ఒక్కరూ మొక్క నాటాలి



కేఎల్‌ఎన్ కళాశాలలో మన్‌కీ బాత్ వింటున్న బీజేపీ నేతలు

మిర్యాలగూడ టౌన్ : దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 'అమ్మ' పేరుతో ఒక చెట్టు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కను నాటి వాతావరణ సమతుల్యానికి సహకరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని కేఎస్ఎం బాలికల కళాశాలలో దేశ ప్రధాని నరేంద్రమోదీ మూడో సారి అధికారం చేపట్టిన తరువాత మన్‌కి బాత్ 111వ ప్రత్యక్ష ప్రసారాన్ని బీజేపీ నేతలు విద్యార్థులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అమ్మపేరుతో తప్పని సరిగా మొక్కను నాటడంతో పాటు వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి చిలుకూరి శ్యాం, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రేపాల పురుషోత్తంరెడ్డి, మాజీ కిసాన్ మోర్చ అధ్యక్షులు సీతారాంరెడ్డి, దొండపాటి వెంకటరెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, హుస్సేన్, రవీందర్‌రెడ్డి, వసంత, జ్యోతి, మాలతి, కృష్ణవేణిలతో పాటు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కట్టా మల్లేష్‌గౌడ్

వేములపల్లి : యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా వాటికి దూరంగా ఉండాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కట్టా మల్లేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని శెట్టిపాలెం గ్రామంలోని యువతతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల బారిన పడి యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమవంతుగా బాధ్యతగా పిల్లలపై నిఘా ఉంచాలని, మాదకద్రవ్యాలు సేవించినా, అమ్మిన వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో మాదకద్రవ్యాలు రాకుండా యువత అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నక్క శ్రీధర్, ధూపాటి సందీప్, తంగెళ్ల సైదిరెడ్డి, కట్టా వినయ్‌కుమార్, రాచూరి రుషి, కుంచం మనోహర్, బంటు విజయ్, నక్క శ్రీకాంత్, బంటు మహేష్, దుండిగాల నాగరాజు, తరుణ్, రాజవర్ధన్‌రెడ్డి, హరీష్, శంకర్, మధు, సాయి, భిక్షపతి పాల్గొన్నారు.

నూతన రేషన్‌కార్డులను జారీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ధనుంజయనాయుడు

నేరేడుచర్ల : తెలంగాణ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులను వెంటనే జారీ చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని బొడలదిన్న గ్రామంలో నిర్వహించిన సీపీఐ, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే ప్రధానంగా రేషన్‌కార్డు ఎంతో అవసరమన్నారు. గత ప్రభుత్వం 10ఏళ్ల పాటు అధికారంలో ఉండి కూడా రేషన్‌కార్డులు ఇవ్వలేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయడంతో పాటు అర్హులైన వారందరికీ నూతనంగా రేషన్‌కార్డులను అందించాలన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి ఎల్లబోయిన సింహాద్రి, సీపీఐ పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్, రైతు సంఘం నాయకులు యల్లబోయిన వెంకన్న, యల్లబోయిన నర్సయ్య, దామరచర్ల సైదులు తదితరులున్నారు.

ఓవర్ లోడ్‌తో టిప్పర్లు



మట్టి లోడుతో వెళ్తున్న లారీలు

కొండమల్లేపల్లి : గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో కుంట నుండి దాదాపు 20 టిప్పర్లతో నల్లరేగడి మట్టిని నెల రోజుల నుండి కొండమల్లేపల్లి మీదుగా ఇబ్రహీంపట్నం వరకు తరలిస్తున్నారు. కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలో ఆదివారం రోజు సంత నిర్వహిస్తుండడంతో వివిధ గ్రామాల నుంచి వివిధ జిల్లా నుంచి కొండమల్లేపల్లి సంతకు వ్యాపారులు అధిక సంఖ్యలో వస్తుంటారు. అధిక ఓవర్ లోడ్‌తో ట్రాలీ పైభాగం వరకు రేగడి మట్టిని నింపు కొని ఓవర్ లోడ్‌తో రావడం వల్ల టిప్పర్లపై భాగంలో మట్టి పెల్లలు కూలి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మైనింగ్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా స్పందించక పోవడం గమనార్హం.

మంత్రి సహకారంతో గ్రామాల అభివృద్ధి



ఎల్బీనగర్‌లో సైడ్ కాల్వ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ

గరిడేపల్లి : మండలంలోని ప్రతి గ్రామాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తామని ఎంపీపీ పెండెం సుజాతశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎల్బీనగర్‌లో ఉపాధిహామీ పథకం నిధులతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామానికి సీసీరోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి మంత్రి ఉత్తమ్ కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. వేసవికాలంలో మంచినీటి ఇబ్బందులను తొలగించేందుకు రూ.98లక్షల నిధులను మంత్రి ఉత్తమ్ మంజూరు చేయించారన్నారు. దీంతో ప్రతి గ్రామంలో బోర్లు వేయించామన్నారు. మంత్రి సహకారంతో మండలంలోని మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో మోహన్‌రావు, వెంకటరెడ్డి, చిరంజీవి, నర్సిరెడ్డి, పాల్గొన్నారు.